# త్యాగం

రాజలక్ష్మి ఉత్తరం వ్రాసింది. తన్నొకసారివచ్చి చూచిపొమ్మంటూ.

ఎందుకో అర్థంకాదు. ఇకచాలు చూడటం; చూసిచూసి ఇంత మట్టుకు వచ్చింది. ఎందుకో చూసుకోవటాలు! ఎందుకో సంబంధం! ఏమిటీ అనుబంధం? ఒక్కక్షణం కళ్ళు మూసుకుంటే జీవితం మాయ మౌతుంది. ఒక్కక్షణం! ఈ లోపునే కళ్లుతెరచి పక్కచూపులు చూసుకోవటాలు; తప్పుకోవటాలు, నటించటాలు, యేడ్పులు, మొత్తుకోళ్ళు; ఇవన్నీ ఎందుకంట! వేదాంతివి అంటూనన్నెవరైనా పరిహసిస్తారుగాక. పరిహాసించనీ! జీవితపు విలువలు నేను కొలవను, ఎన్నో అగాధాలు, ఎంతో ఎత్తులు ఇవన్నీ ఎలా కొలవను? కొలవటానికి సాధనమేదీ? ఎక్కడుంది?

పోకూడదని నిశ్చయించుకున్నాను. కాని నా పట్టుదల సడలింది. వద్దువద్దనుకుంటూనే బయలుదేరాను. ఎన్నిమాట్లో పోయాను కాని రాజలక్ష్మిని చూడటం అనేటప్పటికి ప్రతిసారీ కొత్త ఉత్సాహం వచ్చేది. ఈసారిమాత్రం అంత ఉత్సాహంగా లేదు.

అయినా పోక తప్పదు.

బంధనాలను బలీయం చేసుకోవాలంటే భయంనాకు. అందుకే ఎవరితోటీ హృదయమిచ్చి పుచ్చుకునేట్లు మాట్లాడటం చేతగాదు.

రాజలక్ష్మి నామీద మత్తుమందు చల్లిందో లేక మచ్చిక చేసిందో, రాజలక్ష్మిని నా జీవితాంతం మర్చిపోలేను. రాజలక్ష్మి పిలుపు విని పోకుండా వుండలేను. అంత దగ్గరైనాము కాబట్టే, పిలుపువింటే భయమేస్తుంది. మరీమరీ బలీయంగా ప్రేమబంధంలో కట్టబడతా

మేమోనని. ఒకరికొకరం దూరమైతే బాగుండును. రాజలక్ష్మిని మరచిపోయేశక్తి భగవంతుడు ప్రసాదిస్తే నేనింక ఏమీ కోరుకోను. కాని...కాని...నావశం కావటంలేదు. లేదు. నావశం గాదు.

రాజలక్ష్మిని మరచిపోతే! ఈ వ్యర్థమైన ఆలోచనను నాలో ఎన్నోమార్లు మధించాను కాని ఏమీ లాభం కనపడలేదు. "రాజలక్ష్మి. సుఖాలలో, దుఃఖాలలో, జీవితగమనంలోని లోటుపాట్లతో నాకేం సంబంధం లేదు. రాజలక్ష్మి ఎలావుంటుంది? నేనెప్పుడూ చూడలేదు దుఃఖః జీవా! పోనీలే! ఎంతమందిలేరు భూమిమీద" అని కనీసం నామనసులోనైనా నేను సమాధాన పడగలిగితేచాలు. కాని అదే వీలుగాకుండా వుంది.

ఏమిటీ చెప్పలేని విసుగ్గావుంది. మనసంతా పరిపరి విధాల ఆలోచనతో పాడైంది.

పైన కారుప్రయాణం. దగ్గర దగ్గర యాభై మైళ్ళు కార్లో ప్రయాణం చెయ్యాలి. చిన్నతనంలో ఎంత ఉత్సాహంగా వుండేదీ చెప్పలేను. పరిచయం ఎక్కువై విసుగ్గా వుండేమోకాని, రోడ్డుపక్క చిన్నగా పరిగెత్తే కాలువలు, దూరాన నున్నగా నిగ నిగలాడే కొండలూ, పైన మబ్బులూ, డ్రైవరు తన అనుభవాలను, ముఖ్యంగా ప్రమాద సంఘటనలను తానెలా తప్పుకున్నదీ వర్ణించటాలూ, ఇప్పటికీ అప్పటికీ వొకటీగానే వున్నాయి.

ప్రయాణీకులతో రోజూ కబుర్లు చెబుతాడుకదా? రోజూ ఇదే రోడ్డున ఇన్నివందలమైళ్లు ప్రయాణం చేస్తున్నాడే, అతనికి దినచర్య విసుగ్గా లేదూ? విసుగేం కనపడదే? తమాషాగా వుంది. అనుకున్నాను.

ఆ గోలను తప్పక భరిస్తూ ప్రయాణం చేశాను. అప్పటికే చాలా అలసిపొయ్యాను. గమ్యాన్ని చేరుకున్నాను.

వాకిట్లోనే రాజలక్ష్మి స్వాగతం పలికింది.

"వస్తావనుకోలేదు." అంది.

"వచ్చానుగా!"

"వస్తావనే అనుకున్నాను." భావయుక్తంగా నవ్వింది.

అప్పుడే మొదలైంది నన్నేడిపించటానికి పూనుకోవటం.

కాళ్లు కడుక్కోంటానికి నీళ్ళిచ్చి, కొబ్బరిచెట్టుదగ్గర కాళ్ళు కడుక్కుంటుండగా "ఎందుకొచ్చినట్లు?" అంది.

నాకు తలతిరిగినంత పనైంది.

కోపంతో (రావాల్సిందిగాదు) వెనక్కు తిరిగాను.

పైటచెరుగు అడ్డుపెట్టుకుని ముఖం పక్కగా తిప్పి నవ్వుతున్నది.

"వెళ్లిపొమ్మంటావా?"అన్నాను చిన్నపిల్లాడిలా మొహంపెట్టి. రాజలక్ష్మి ఇంట్లోకి వెళ్లిపోయింది.

మొఖం తుడుచుకొని బయటగదిలో కూర్చున్నాను.

కాఫీ తెచ్చింది రాజలక్ష్మి.

ఆ నవ్వుముఖం అలానే ఉంది,

"ఎందుకొచ్చావంటుంటే? వెళ్లిపొమ్మంటావా అని అడుగుతావు, నేవెళ్ళమంటున్నానా?" అంది.

నేనేదో అడుగుతుండగా "సరే సరే! నీళ్ళు కాగుతున్నాయి స్నానంచేసి వెళ్ళుదువుగాని". అంది. చెప్పేది వినిపించుకోకుండా ఇంట్లోకి వెళ్ళిపోయింది.

భోజనాలు చేస్తుండగా రాజలక్ష్మి ఏమీ మాట్లాడలేదు. ఇంట్లో వాళ్ళమ్మ నాకేదో చెప్పబోతుంటే "చెప్పవచ్చులే శుభవార్త" అంది చాలా మామూలుగా. నేనేమీ పట్టించుకోలేదు. రాజలక్ష్మి వేపు క్షణం చూశాను. ఏదో మాలిన్యము క్షణంసేపు మొఖమంతా కమ్ముకుంది. కాని మరుక్షణంలోనే మల్లెపూలు విచ్చుకుంటున్నట్లు నవ్వుతూ తిరిగింది.

ప్రయాణం బడలిక పూర్తిగా తీరలేదు. కళ్లు మూసుకుని మంచంమీద దొర్లుతున్నాను. రాజలక్ష్మి కాఫీ కప్పుతో ప్రత్యక్షమైంది.

"ఇక లేవచ్చు." అంద.

బుద్ధిమంతుడైన పిల్లాడిలా వెంటనే లేచి కూర్చున్నాను. కాఫీ తాగినతర్వాత ఇంట్లోకి వెళ్లి తిరిగివచ్చింది రాజలక్ష్మి.

ఎదురుగా కూర్చుంది.

"ఎందుకువచ్చావో తెలుసుకోవాలనుకుంటున్నావా?"

"చెబితే సంతోషిస్తాను"

"నే పెళ్ళి చేసుకోబోతున్నాను."

రాజలక్ష్మి చాలా మామూలుగా చెప్పింది. ఎంత మామూలుగా చెప్పిందంటే ఏమాత్రం విచలితురాలు కాలేదు.

"నాకేం" అన్నాను లోపల జరుగుతున్న మథనను అణచుకుంటూ.

"ఏఊరు? ఏమిటీ విశేషాలు?" అన్నాను

'రాత్రికి చెబుతాను. షికారుగా అలా వెళ్ళిరా.' అంది.

నేను అక్కడ వుండటాన్ని భరించలేక పొయ్యాను. అలా ఊరివెలుపలికి షికారు వెళ్దామని బయలుదేరాను. ఈఊరు, ఇది వరకు ఎన్నిసార్లో, ఏదో పురస్కరించుకుని వచ్చాను. ఊరి వాతావరణం కొత్తకాదు. దూరంగా పూర్వపు రాజులు కట్టించిన కోట ఒకటుంది. ఎప్పుడూ తాళాలు బిగించి వుంటుందేవి. సింహద్వారానికి లోపలకువెళ్ళి, చూడటం పడలేదు.

కాలువ వంతెనమీద ప్రసాదరావూ, వెంకటేశ్వర్లూ కనపడ్డారు. ఈ ఊళ్లో పరిచయస్తులెవరైనా వున్నారంటె వీళ్ళిద్దరే పరిచయస్తులు నాకు. ఎప్పుడో వచ్చినప్పుడు మాకు స్నేహమయింది. తర్వాత వొకటి రెండుసార్లు నేను వచ్చినప్పుడు ఊళ్లో లేరు. మళ్లీ చాలారోజుల తర్వాత ఇవాళ కలుసుకున్నాం. నేను దగ్గరగా వచ్చేదాకా గుర్తు పట్టినట్లు లేదు.

ఏదో విషయాన్ని గురించి తీవ్రంగా చర్చించుకుంటున్నారు.

అనవసర ప్రశ్నలకు సమాధానాలు చెప్పినతర్వాత వెంకటేశ్వర్లన్నాడు "కోటలోకి పోదాం." అని

"తాళాలు వేసివుంటాయిగా?" అన్నాను నేను"

ప్రసాదరావు చెప్పాడు. "రాజుగారు వచ్చారట. ఎవరినో తెచ్చారట. వాళ్లొచ్చినప్పటినుంచీ తాళాలు తీసే వుంటున్నాయ. వెళ్లి చూసిరావచ్చు."

ఎవరినో తేవటమేమిటీ?" ప్రశ్నించాను." ఈమాత్రం తెలియదు ఎవతెనో తెచ్చారు వెంకటేశ్వర్లు విపులీకరించాడు.

"అలాచెబితే ఎందుకర్థంకాదు." అన్నాను.

కోటదగ్గరికి నడిచాం. కోట ఊరికెక్కువదూరంగాలేదు. ఒక మూల ఊరు కలిసే వుంటుంది. లోపల అడుగు పెట్టగానే కొత్త లోకంలో ప్రవేశించినట్లుంది. శిథిలమైన కోటగోడల వెనుక సూర్యు డస్తమిస్తున్నాడు. "అదిగో రాణీగారి ఒంటిస్తంభపు మేడ" అన్నాడు వెంకటేశ్వర్లు. ఆ వైపు చూశాను. రాణిగారి వొంటి స్తంభపు మేడనిండా గురివింద పొదలు దట్టంగా అల్లుకొనివున్నాయి.

అస్తమిత సూర్యబింబపు అరుణకాంతులు పాలరాళ్ళ రాణీగారి మేడను గోముగా స్పృశిస్తున్నాయి.

అదీ శిథిలమైంది. ఎటుచూచినా శీతాఫలపుచెట్లూ, జామచెట్లు ముందు కనబడుతున్నాయి.

ఒకసారి నాకు నేను ప్రదక్షణం చేసుకుని, కోట నలుమూలలా దృష్టి సారించాను.

ఎన్నో కథలు కళ్ళముందు కదలినట్లు అనిపించింది. ఎన్నో కలలు రూపుదాల్చి ఎదుట నిల్చినట్లనిపించింది. ఎన్నో శిలలు జీవం పోసుకొని మాట్లాడినట్లు మనసు భ్రమించింది.

కళ్ళు గిఱ్ఱున తిరిగాయి.

ఎంతమందో రాజులు ఇక్కడే విఱ్ఱవీగి వుంటారు. ఎంతమంది రాణులో అందాలు వొలకబోసి వుంటారు. ఈ పాడుబడ్డ కొలనులో జలక్రీడలు—

ఈ పూలవనంలో పుష్పాపచయం...

ఇక్కడ విహారం. ఇక్కడ ఊయెలలు—

కాశీమజిలీల కథల్లో తిరుగుతున్నట్లనిపించింది. కాస్త ముందుకు వెళ్ళాం. ఇంకా పొద్దు పూర్తిగా యేటవాలలేదు.

నడుమ దారిలో ఓ బండమీద అరవిచ్చిన మల్లెమొగ్గల్లావున్న ఇద్దరమ్మాయిలు, పులిజూదమో, ఏదో రాళ్ళుపేర్చి ఆడుతున్నారు. చిన్నపిల్లలు.

ముగ్గురం ఆగిపోయ్యాం.

వెంకటేశ్వర్లు నవ్వుకున్నాడు.

"నీ పేరేమిటి!" ఓ అమ్మాయిని ప్రశ్నించాను.

"లత" వయ్యారంగా చెప్పింది.

"ఉత్త లతేనా?" అని అడిగాను.

"మరెలావుండాలి?" అంది ధిక్కరిస్తూ.

"పూర్తిపేరో?" అన్నాను.

"అంతే—?" అంది.

"చెప్పు హేమా? అలా అనవచ్చా?" అన్నాడు వెంకటేశ్వర్లు.

"నేనే చెప్పేదా? నీపేరు?" అన్నాను లతతో.

"ఊ...ఎందుకు చెప్పారు?" అని సాగదీసింది వెంకటేశ్వర్ల వైపు చూస్తూ...తాను నన్నేమో ఆడించలేకుండా చేశాడని ఆ చూపులు చెబుతున్నాయి.

"మిమ్మల్ని ఆడించేదాన్ని వెంకటేశ్వర్లుగారు చెప్పకుండావున్నట్లయితే" అంది.

నేను నవ్వాను.

'దాడి ఆడతారా?' సవాలు ధ్వనించింది. హేమ అడిగింది.

"ఓ..." అన్నాను.

"పొగడపూలు ఏరుతుంటాను హేమా, వోడించెయ్యాలి"

రెండో అమ్మాయి హుషారిచ్చి వెళ్ళిపోయింది,

నిజానికి దాడిఆట నాకు బొత్తిగా రాదు.

అయినా కూర్చున్నాను.

వాళ్ళిద్దరూ "పైకెళ్ళొస్తామని'' వెళ్లిపోయ్యారు.

నేను వరసగా వోడిపోయాను. నేను వోడిపోయినప్పుడల్లా హేమ గేలి చేసేది. ముఖం చాటంత చేసుకునేది. హేమ అల్లరి చూస్తుంటే, దేశకాల పాత్రాతీతంగా, దాడిఆట ఆడుతూ, వోడిపోతుంటే బావుణ్ణనిపించింది. అరగంటలో ఆరుసార్లు వోడిపోయాను ఇంతలోకే వాళ్ళొచ్చారు.

'వీరిమీద ఆరుకొమ్ములు.' అంది హేమ వాళ్లను చూపుతూ.

నేను తల తడుముకున్నాను. 'కొమ్ములేవీ అంటూ.' హేమ వొకటే నవ్వింది. లోకాన్ని చీకటిచారలు కప్పుకున్నాయి. రెండో అమ్మాయి వొడినిండా పొగడపూలు తెచ్చింది ఇండ్లకు బయలు దేరాం. దారిలో వెంకటేశ్వర్లడిగాడు, హేమా కోటలో కెందుకొస్తారు 'రోజూ అని.' పొగడపూలు ఏరుకోవటానికీ దాడి ఆట ఆడటానికి' దీర్ఘాలుతీస్తూ సమాధానం చెప్పింది హేమ.

ఊళ్ళో మర్రిచెట్టు దగ్గర వాళ్ళు నన్నొదిలి పోయారు. నేనింటి కెళ్లాను. రాజలక్ష్మి బయట గదిని శుభ్రం చేస్తున్నది. "దొరగారొచ్చేరు కదా?" అంది నన్ను చూసి.

"అలానే వెళ్లిపోతా ననుకున్నావా?"

"ఇలా వచ్చి కూర్చో." పోయి కూర్చున్నాను. పక్క చాలా పరిశుభ్రంగా వుంది.

"ఎక్కడికి వెళ్లావు?"

"కోటలోకి."

"దొరసానిని చూశావా?"

"ఊఁ...హూ..."

"చాలా అందంగా వుంది కదూ?"

"అవును."

రాజలక్ష్మి పెద్దగా నవ్వింది. అప్పుడు నాకు తెలిసొచ్చింది. చాలా సిగ్గేసింది. "అబ్బే నేను చూడలేదు. ఏదో ధ్యాసలో వుండి అన్నాను."

"ఎవరి ధ్యాస."

"నీదే..."

"నా గురించా? అయితే వస్తా." రాజలక్ష్మి ఇంట్లోకి వెళ్ళి పోయినది.

భోజనాల దగ్గర చాలా విషయాలు తెలిశాయి. రాజలక్ష్మి పెళ్ళి పదిహేను రోజులుంది వరుడి కరవైయేళ్లు. మూడో సంబంధము. ఆరులక్షల ఆస్తిపరుడు. ముగ్గురో నలుగురో పిల్లలు, గంపెడు నగలు, ఇంకేం కావాలి. ఇంట్లో ముసలాళ్ళకి హాయిగా వుంది.

రాజలక్ష్మి కోసం భోజనం చేస్తున్నంతసేపూ నా కళ్ళు వెతుక్కున్నాయి. కానీ రాజలక్ష్మి నాకకనిపించలేదు. నాకు ముద్ద కూడా మింగుడు పడలేదు.

తల తిరిగి పోతున్నది. డోకువచ్చేది. ఎలానో లేచి పక్కమీది కెళ్ళాను.

గంటసేపు గడచిన తర్వాత రాజలక్ష్మివచ్చింది. ముఖంలోనూ మాటలలోను మార్పేమీ కనపడలేదు. అలానే వుంది.

"ఎందుకొచ్చావో తెలుసుకున్నావుగా?" అంది వస్తూనే.

"చాలా సంతోషంగా వుంది. ప్రొద్దున్నే వెళ్ళిపోతాను."

"ఏం?" అంది ఆదుర్దా ధ్వనించే గళంతో.

"ఇంత సంతోషకర వార్తకు తట్టుకోలేక."

రాజలక్ష్మి మలినంగా నవ్వింది.

"నీ కేలావుంది?" అంది.

"లగ్నాలు కూడా పెట్టుకున్నారా?"

"ఏం? లేకపోతే చెడగొడదామనా? నాకు చాలా ఇష్టంగా వుంది" అంది.

"అడ్డదోవల మాట్లాడి నన్ను చంపకు. నిజం చెప్పు. ఈ సంబంధానికి ఎందుకిష్టపడ్డావు?"

"ఆయన చాలా బాగుంటాడట. అంతే అందంగా" పొర్లివచ్చే నవ్వు పైట చెరగు అడ్డంచేసి ఆపుకుంటున్నది.

నాకు చిరాకేసింది. నేను బాధ ధ్వనించే కంఠంతో "నిజమని నా మనసు వొప్పుకోవటంలేదు. కలగావుంది. రాజక్కాయ్, యీ సంబధము చేసుకోవద్దు. దీనివలన నీకు దుఃఖమేగాని, ఆవగింజంత యినా సుఖప్రాప్తి కలగదు?" 'ఎందువల్ల?'

"నీకు తెలుసు."

"తెలీకనే!"

"అయితే ఏం చెప్పమంటావు? జీవితాన్ని ఏమనుభవిస్తావు?"

రాజలక్ష్మి మోహం కాసేపు ముడుచుకుంది.

మళ్లీ అంతలోనే మామూలుగా మారిపోయింది.

"కావలసినంత వైభవం పశువులు, పాడి, పిల్లలు ఇంకేం కావాలి?" అంది.

"అంతేనా జీవితానికి కావలసింది?"

"నాకు పిల్లలు పుట్టరని కదూ?" ఆ మాటలు రాజలక్ష్మి వుచ్చరిస్తుండగా నేను తలవంచు కున్నాను.

"నా కిప్పుడే నలుగురు పిల్లలు. తెలుసా. ఇంకా పిల్లలెందుకు నా పెద్ద కొడుకు స్కూలుఫైనల్ చదువుతున్నాట్ట." కిలకిలా నవ్వింది రాజలక్ష్మి.

నాకు యేడు పొచ్చింది.

రాజలక్ష్మి మనసు వెన్నతోచేశాడో, పాషాణంతో మలచాడో అర్థంగాదు. రాజలక్ష్మి మనసు ఎలా మార్చాలి భగవంతుడా? ఏం చెప్పినా వినిపించుకోదేం? అనుకున్నాను మనసులో.

"ఇక నువ్వెళ్ళిపో. నిన్ను నేను చూడలేను" అన్నాను.

రాజలక్ష్మి నిట్టూర్చింది. రాజలక్ష్మి నిట్టూర్చటం అదే మొదటి సారి నేను చూడటం.

తల పైకెత్తి రాజలక్ష్మి వేపు చూశాను.

నిశ్చలంగా వుంది రాజలక్ష్మి.

ఇంతలోకే ఇంట్లోంచి పిలుపొచ్చింది.

రాజలక్ష్మి వడివడిగా వెళ్ళిపోయింది.

నేను రాజలక్ష్మిని గురించి ఆలోచనలతో పక్కమీద జేరగిల బడ్డాను. భగవంతుడా ఇలాటి అమ్మాయిని ఎలా సృష్టించావు? అని పించింది.

ఎప్పుడో నాకు ఐదేళ్ళుండగా అమ్మ తీసుకొచ్చింది. వాళ్లు ఎలాటి చుట్టాలో నాకు తెలీదు. ఎందుకి వూరొచ్చామో కూడా తెలీదు. కారు ప్రయాణం చేయటమంటే చాలా సరదాగా వుండేది. కారు ఆగినప్పుడల్లా, కండక్టరుతో పాటు 'హోల్డాన్' అంటం నాకు

సరదా! కారు కదిలినప్పుడు 'రైట్' అంటం నా కలవాటు. అమ్మ నానోరు గట్టిగా మూసేది. అయినా నేను అంటుండేవాణ్ణి. అందుకే చిన్నతనంలో కారుప్రయాణమంటే నాకు చాలా సరదాగా వుండేది.

అమ్మ ఎంతో హృదయభారంతో వున్నా, ఆ ఊరెళ్లాలని నాకు తెలిసేటప్పటికి చాలా సంతోషంగా వుంది, వెళ్ళాము.

బండి దిగి ఇంట్లోకి వెళ్లగానే అమ్మను చూసి అంతా ఘొల్లున యేడ్చారు. రాజలక్ష్మికి ఎనిమిది తొమ్మిదేండ్లుంటాయేమో అప్పటికే వచ్చి నన్ను కౌగలించుకుంది.

అవతలికి తీసుకెళ్ళింది. తినటానికి ఏదో ఇచ్చింది. అప్పటి నుంచీ రాజలక్ష్మికి నాకూ ఏదో తీరని అనుబంధం యేర్పడింది. అక్కడ నాలుగైదు రోజులున్నాం. ఆ నాలుగు రోజులూ అమ్మను మర్చిపోయాను. రాజలక్ష్మే అన్నం పెట్టేది. రాజలక్ష్మి ప్రక్కనే పడుకుని నిద్రపోయేవాణ్ణి. ఓరోజు రాత్రి తెలియక అడిగాను. "ఎందుకింట్లో వాళ్లు యేడుస్తున్నారు?" అని.

''మా నాన్న చచ్చిపోయాడుగా'' అంది రాజలక్ష్మి చుక్కల వేపు చూస్తూ.

నేనింక ఏ ప్రశ్నలు వెయ్యలేదు.

అలా ప్రథమ పరిచయం మొదలైంది.

ఊహ తెలిసిన తర్వాత రాజలక్ష్మి అంటే అవ్యాజానురాగం యేర్పడ్డది.

తర్వాత చాలా మార్లు వచ్చాను.

రాజలక్ష్మి వాళ్లది చాలా బీదసంసారం. రాజు పెద్దపిల్ల. ఇంకా చిన్న చిన్న పిల్లలు చాలా మంది వున్నారు.

రాజలక్ష్మి మళ్ళీ వస్తుందేమోనని చూశాను. కాని మళ్ళీ రాలేదు.

ఆ రాత్రి నిద్ర పట్టలేదు. రాజలక్ష్మి పెండ్లీ, వరుడూ, ఇంటి నిండా పిల్లలు. భావిజీవితం, ఇవే ఆలోచనలుగా పైన కొత్తచోటు. గాలి వెయ్యటం లేదు. దోమలబాధ విపరీతంగా వుంది. మనసు ప్రశాంతంగా వుండి నిద్ర లేకపోతే బాధలేదు. ఈ ఆలోచనలనుండి తప్పుకోవటానికైనా నిద్ర కావాలి, కాని అదే కలగటం లేదు.

రాజలక్ష్మి మనస్తత్వాన్ని ఎంత ఆలోచించినా కనుక్కోలేక పోతున్నాను. లీలగా అయినా రాజు మనస్తత్వాన్ని గూర్చి, నా మనసున వొక రూపమంటూ యేర్పడటంలేదు. ఏమి టాలోచించిందో? ఏమిటి నిశ్చయించుకుందో? అనుకున్నాను.

పద్దెనిమిది పందొమ్మిదేళ్ల వయస్సులో వుండాల్సిన కోరికలు, సాఫల్యం కోసం పడేపాట్లు, మధురమైన ఊహాలూ వదిలేసి, జీవితాంతం, ఎవరో కన్నపిల్లలకు జీవితాన్ని అంకితముచేసి విరాగిగా బ్రతుకుతుందా?

ఇందులో ఏదైనా ప్రలోభముందా?
రాజలక్ష్మి ఇష్టపడే వొప్పుకుందా?
లేక బలవత్తరమైన శక్తులు అలా పనిచేశాయా?
డబ్బంటే నగలంటే వ్యామోహమా?
ఏమిటీ రహస్యాలు? వీటినెలా తేల్చాలి?
రాజలక్ష్మి నడిగితే? ఏవో చెబుతుంది.
వెకిలినవ్వులు నవ్వుతుంది. గలగలా మాట్లాడేస్తుంది.
క్షణంసేపు రాజలక్ష్మి అంటే చెప్పలేని అసహ్యం కలిగింది.

ఇంతలోనే నా ప్రియతమమైన రాజుకు అపచారం చెస్తున్న ట్లనిపించింది. కళ్లలో నీళ్ళు తిరిగినై. అప్పుడే కాస్త నిద్రపట్టింది. నిద్రలేచే టప్పటికి చాలా ప్రొద్దుపోయింది. కళ్ళుమంటలు పుడు తున్నాయి. కొబ్బరిచెట్టు ఆకుల్లోంచి సూటిగా సూర్యకిరణాలు పక్కమీదికి పాకుతున్నాయి. లేచి కూచున్నాను.

రాజలక్ష్మి ప్రొద్దుటే స్నానం చేసినట్లుంది, నుదుట కుంకుమ కాంతితో మెరుస్తున్నది.

"అయ్యగారు నిద్రలేచారు. ఇప్పటికి మూడుసార్లు వచ్చి చూసి పొయ్యాను. కుంభకర్ణుడి తమ్ముడివై తే ఎట్లా?" అంటూ "నీ కళ్లంత యెర్రగా వున్నాయేం?" అంది.

నాకు ఏంచెప్పటానికి తోచలేదు.

"చప్పున కానియ్. నేను గుడికి వెళ్ళాలి" అంది.

కాఫీతాగి. 'నేను ఈపూంట వెళ్తాను,''అన్నాను అర్ధస్వగతంగా. రాజలక్ష్మి సమాధానం చెప్పకుండా కళ్ళు తిప్పుకుంటూ వెళ్ళి పోయింది.

నాకు వెళ్లిపోయే ధైర్యం లేదు.

మళ్ళీ పడుకుందా మనిపించింది.

సంచిలోంచి ఏవో పుస్తకాలు తీసి చదువుదామని ప్రయత్నిం చాను. కానీ కళ్లు నీళ్లు కారటం మొదలైంది, మగతగా నిద్రపట్టింది

పదకొండు గంటలప్పుడు రాజలక్ష్మి, నిద్ర లేపింది.

"వొంట్లో బాగా లేదా యేం? ప్రొద్దుటనుంచీ నిద్రపోతు న్నావు." అంది రాజలక్ష్మి. వొళ్లు చూసింది. నాకు భయం పుట్టింది. నిజంగా ఇక్కడ సుస్తీపడితే వీళ్ల కెంత బాధ కలిగించినవాణ్ణవుతాను.

ఆందోళన అధికమై, ఎక్కువగా ఆలోచించ లేకపోయాను.

"ఏం లేదులే."

"స్నానం చెయ్యి. వంటైంది. రాత్రి నిద్రలేక బద్దకంగా వుంది." అంది రాజలక్ష్మి.

భోజనం చేశాను. మళ్ళీ మేను వాల్చాను.

రాజలక్ష్మి వచ్చింది; కాని వెంటనే వెళ్ళిపోయింది మాట్లాడకుండా.

మూడింటికి మెలకువ వచ్చింది.

ఇంట్లో వాళ్లు హడావుడిగా తిరుగుతున్నారు.

వాళ్ల సంతోషం చూచి నాకు మంటపుట్టింది.

ఇంట్లో కూచోలేక పోయాను.

వెంటనే లేచి బయటి కొచ్చేశాను.

రాజలక్ష్మి ఇంట్లోలేదు.

అందుకే అంత నిర్భయంగా నేను బయటపడ గలిగాను.

ఎండ పూర్తిగా తగ్గలేదు. గాలి కొంచెం కొంచెం చల్లబడుతున్నది. మఱ్ఱిచెట్టు ముందుగా నడచివెళ్లి పంటకాలువ దగ్గరికి చేరుకున్నాను. వంతెనమీద కూచున్నాను.

అల్లరి పిల్లలు కాలవలో యీతలు కొడుతున్నారు. నావైపు వింతగా చూశారు.

మామిడిపళ్లు అమ్ముకుంటానికి పోతున్న అమ్మిని ఆపి, ఒక పండు తీసుకున్నాను. చిన్న పిల్లాడిలా దాన్నిపీక్కు తిని కాలువగట్టు వెంబడే కొంత దూరంపోయి, వో బండమీద ఆగి, కాసిని మంచి నీళ్ళుతాగి, కాసేపు అక్కడే కూచున్నాను. దూరంగా కాలవ సన్నబడుతూ కనబడింది. రాళ్ళు నీళ్లలోకి విసురుతూ ఎంతసేపు

గడిపానో, లేచి వంతెన దగ్గరికి వెళ్ళేటప్పటికి వెంకటేశ్వర్లూ, ప్రసాద రావూ కనపడ్డారు. మళ్లీ ముగ్గురం కలసి మాట్లాడుకుంటూ కోట వైపు నడచిపోయాం.

బాగా చల్లబడ్డది ప్రకృతి. నాలుగు మూలల నుంచీ మబ్బులు కమ్ముకొస్తున్నాయి. ప్రకృతి యావత్తూ వర్షాత్పూర్వ శోభలో తన్ను తాను మరచిపోయింది.

కంప పక్కన్నే వున్న పనసచెట్టుకు మొదలులో ఇంతలావు కాయ వేలాడుతున్నది. ఐదారుగురు పిల్లలు పనసపండు సంగ్రహించ టానికి దారి ప్రక్కన కుట్రచేస్తున్నారు.

కోట సింహద్వారం గడచి లోపల కడుగు పెట్టగానే మఱ్ఱి చెట్టు స్వాగతం పలికింది.

పడిపోయిన పాడుగోడ కథ చెబుతా రమ్మన్నది. బురుజుపైన వోమూల గోరువంక దంపతులు ప్రథమ రాత్రి ముచ్చట్లు చెప్పు కుంటున్నాయి కాబోలు, అందులో వొకటి అలతి సిగ్గున తలవాల్చి కొంది.

విశాలమైన ప్రాకారాలు కళ్ళువిప్పి మాట్లాడి నట్లనిపించింది. ఓ మూల కాపలా వాడు కేకలేస్తున్నాడు. మా దగ్గరకొచ్చి 'చూడు బాబూ కొమ్మలన్నీ ఎలా తుంచేశారో' అన్నాడు. ప్రసాదరావు కాపలా వాడితో రాజుగారి కుటుంబ వ్యవహారాలు మాట్లాడటం మొదలెట్టాడు.

రాజ్యాలూ, హోదాలూ, వైభవం అంతరించినా, ఆడంబరం వదలి పెట్టిపోలేదు. పడిపోయిన పాతకోట మారుమూల బాగున్న గదిలో, నగరా మోగుతున్నది. ఇంకా మేళాలూ, తాళాలూ, ఎందుకు?

చనిపోయిన మనిషికి సుగంధ ద్రవ్యాలను పులిమి, ఊరేగింపుగా శ్మశానానికి తీసుకెళుతున్నట్లుగా వుంది కోట వైభవము. ఇప్పుడెంత అలంకారాలు చేసినా, సాయం నగారాలు మోగించినా, కాపలావాళ్ళు వొది గొదిగి నడచినా: ఏతత్పూర్వ వైభవం రవంతైనా మరలి రాదుగదా

వృద్ధాప్యంలో పడుచుతనపు పోకిళ్ళు ఎలా రావో, పూర్వపు వైభవోన్నతులూ మళ్ళీ రావు.

అంతే!

కాపలావాణ్ణీ నిమిషంలోనే ఎలా మచ్చిక చేసుకున్నాడో, వాడు ఏవేవో చేప్పేస్తున్నాడు ప్రసాదరావుకు.

కొత్తగా ఆయన తెచ్చిన దొరసానిని గురించీ, ఆవిడ అందచందాలను గురించీ, పోకులను గురించీ, ఇప్పుడున్న రాజుగారి తండ్రిని గురించీ, ఏవేవో చెబుతున్నాడు.

ప్రసాదరావు చెప్పిస్తున్నాడు.

వెంకటేశ్వర్లు నోరు తెరుచుకొని వింటున్నాడు.

నాకక్కడుండ బుద్ధి పుట్టలేదు.

పొగడ చెట్టు దగ్గర, బండిమీద హేమ కూచుని వుంటుందని నా ఆశ, అటు వెళ్ళాలి.

వాళ్లు కదిలేట్లులేదు, కూచున్నారు అక్కడే. నేను కదిలి వెళ్ళిపోయాను. హేమ వొక్కతే కూచోనుంది. నన్ను చూడగానే పరిగెత్తుకొచ్చింది, రెండు చేతులూ పట్టుకొని, కళ్ళల్లోకి చూస్తూ.

'ఆడుకుందాం' అంది.

'ఆ అమ్మాయేదీ?' అడిగాను.

'వాళ్లింటికి చుట్టా లొచ్చారుట, అందుకని నన్నొదిలేసింది,' రాళ్లు ఏరుతున్నది హేమ.

ఆటకు కూచున్నాం, నిన్న చాలాసార్లు వోడిపోయినందు వల్ల ఆట కొంచెం కొంచెం తెలిసింది.

ఇవాళ అంత తేలిగ్గా వోడిపోలేక పోయ్యాను ఏదో ఆ రాళ్ళటు, యీ రాళ్లిటూ మారుస్తున్నాను. కష్టపడి ఫలితం దక్కించుకోవడంలో వున్నంత సౌఖ్యం, సుఖంగా వాంఛితాన్ని పొందటంలో లేదు.

కష్టపడి హేమ నన్ను వోడించింది.

నేను చాలా శ్రమించి వోడిపోయాను.

నా వైపు చూసి నవ్వింది హేమ. 'ఈసారి నువ్వోడి పోతావు చూడు' అన్నాను. వెంటనే చేయి పట్టుకు లాగింది. రాళ్లు పెట్టమన్నది. భగవంతుడా! అనుకున్నాను. ఈ సారి కూడా నే వోడిపోవటం తథ్యం. ఎలా వదుల్చుకోవటం! అన్యాయం చేసి ఆట గెలుద్దామన్నా నా మార్గం కట్టుపడ్డది. గాలికి మబ్బులు తేలిపొయ్యాయి. చీకటి పడబోతున్నది.

'పూలేరుకోవద్దా?' అన్నాను

'ఓడిపోయి నట్లొప్పుకుంటే వదిలేస్తా.' అంది ధీమాగా.

'ఎలా వొప్పుకుంటాను, ఈసారి నువ్వే వోడి పోతావు' అన్నాను.

హేమకు కోపమొచ్చింది, మూతి వంకర తిరిగేప్పటికి గడ్డం కొనతేలింది. కొడుతుందేమో ననిపించింది. బుజాలు పట్టుకుని వూపుతూ 'ఓడిపోయాను హేమా! వొకసారి కాదు, వందసార్లు' అన్నాను నవ్వుతూ.

'అయితే మరి పూలు ఏరిపెట్టరూ?' అంది.

ఇద్దరం కలసి పొగడచెట్టు దగ్గరకు వెళ్లాం. చప్పున వొడి నిండా యేరుతున్నది హేమ. నేను గుప్పెళ్ళు పోగుచేసి హేమ వొళ్లో పోస్తున్నాను.

'ఇక చాలు' అంది.

ఓ గుప్పెడు పూలు తీసుకుని నా జేబులో పోసుకున్నాను.

పూర్తిగా చీకటి పడిపోయింది.

కోట సింహద్వారం మీద నెలవంక నాట్యమాడింది. వెంకటేశ్వర్లూ, ప్రసాదరావు నా వేపు వచ్చారు.

'ఇంకా ఇక్కడే ఆడుతున్నావు. ఇంటి కెళ్లితే అమ్మ కోప్పడదా హేమా?' అన్నాడు వెంకటేశ్వర్లు.

హేమకు అప్పటికి ఇల్లు గుర్తొచ్చి నట్లుంది.

జాలిగా ముఖం పెట్టింది. చీకటి!

'నీకు రాజక్కాయ్ తెలుసునా హేమా?' అడిగాను.

'ఎవరూ?' అన్నది.

వెంకటేశ్వర్లు చెప్పాడు.

"ఓహ్ తెలీకేం, వొదినతో నే నెప్పుడూ గవ్వలాడతాను. ఇప్పుడు దాకా మా ఇంట్లోనే వుంది. మీ రక్కడికి, వాళ్లింటి కొచ్చారా? వాళ్ల చుట్టాలా?" అంది గుక్క తిప్పుకోకుండా.

"అయితే రేప్రొద్దున వస్తాను" అని కలిపింది.

"మరి మీ అమ్మ కోప్పడితే, "రాజలక్ష్మి గారింటి కెవరో కొత్తబ్బాయి వచ్చాడు. ఆ అబ్బాయి కోటలో కనపడి పోనియ్య లేదు" అని చెప్పు అన్నాను.

"మా ఇంటి దాకా రారూ?" అంది.

వంతెన మీద నేనూ ప్రసాదరావూ కూచున్నాము. వెంక టేశ్వర్లు హేమను ఇంటి దగ్గర దిగబెట్టి రావటానికి వెళ్లిపోయాడు.

ప్రసాదరావు కథ మొదలెట్టాడు.

ఈ కోట నెప్పుడో ఎన్నాళ్ల క్రిందటో, గట్టిగా కట్టించారు. రాజుగారి తండ్రి ఎవరెనో తెచ్చారు.. అసలు భార్య ఉరేసుకు చనిపోయింది. అప్పటినుంచి కోట ప్రాభవం తరిగి పోయింది. దురదృష్టం చుట్టుకుంది. రాజుగారి చెల్లెలు ఓసారి శ్రీరామనవమి ఉత్సవాల్లో ఒక సామాన్యుణ్ణి చూసి మన సిచ్చుకుంది. కాని, ఆమె ప్రేమ ఫలించలేదు. అవిడ దుఃఖం కోటకు శాపంలా చుట్టుకుంది.

ఆవిడ ఆ సామాన్యుణ్ణి మర్చిపోలేక పోయింది. మన సిచ్చు కున్న మగువ మగవాణ్ణెలా మరుస్తుంది. మరులు గొన్నది. తన మరులు అతగాడికి ఉరు లవుతాయని ఆవిడ కేంతెలుసు ?

సంకేతా లేర్పడ్డాయి.

సామాన్యుడు కోటలోకి రావటం, పోవటం సాగించాడు.

అది కంటకంగా పరిణమించింది తండ్రీ కొడుకులకు.

నమ్మించి అతగాడి గొంతుక్కోశారు.

నాలుగో కంటి వాడికి తెలియదు.

ఆ ముద్దరాలు వలవల లాడింది. కంటికి కడివెడుగా యేడ్చింది. పెద్ద పెద్ద ఇండ్లలో జరిగే ఘోరా లెవరికి తెలుస్తాయి? హత్యలు జరిగితే శవపరీక్షకూడా జరగదు. గుంభనగా జరిగి పోతుంది.

వాళ్లు ప్రేమించటానికి వీలులేదు, వాళ్ళు అస్వతంత్రులు, వాళ్లకు మనసుండ కూడదు, వాళ్ళు నగలతో నాణ్యాలతో నలిగి

పోవలసిందే. మర్యాదా మప్పిదం, వాళ్ళు నేర్చుకోవాలి, వాళ్ళు అలంకరింపబడ్డ ప్రాణాలు, చేతనయివుండదు వారికి.

తాను ప్రేమించటమే అతడి మరణానికి కారణమైందని, ఆ అమ్మాయి కుమిలిపోయింది. స్వేచ్ఛగా సుఖంగా తన మానాన తాను బ్రతుకుతున్న వాణ్ని, తన జీవితంలోకి లాక్కుని మృత్యు గహ్వరం లోకి పంపించింది తాను.

చనిపోయిన అమ్మను తలచుకొని చాలా సేపు యేడ్చింది. "అంతఃపురాల్లో ఆడపుటక పుట్టటమే మహాపాప మమ్మా." అని వాళ్ళమ్మకు చెప్పుకుంది,

పాపం ప్రక్షాళించు కోవటానికి, తనను క్షమించమని ప్రాధేయ పడటానికీ ఆ అమ్మాయి వురేసుకు చనిపోయింది.

తల్లీ, చెల్లెలూ, బలవన్మరణం పాలుకావటం తెలిసి, యీ రాజుకు పెళ్లి కాలేదు. అందుకనే యేడాది కొకరినిమార్చి, ఇక్క డికి మూణ్ణెల్ల పాటు వచ్చి వుంటుంటాడు.

ఇది ప్రసాదరావు చెప్పాడు.

వెంకటేశ్వర్లు వచ్చాడు.

ఆ విషాదగాథ నాహృదయంలో మెదిలి, నా హృదయం మూలిగింది. చెప్పలేని సంచలనం కలిగింది నాలో. ఏమిటీ మాన వులు? ఏమిటీ మనుషులు? ఏమిటీ రాగద్వేషాలు?

వీటికి సమాధానం ఎవరు చెబుతారు? ఆ చీకటిలోనే కోట వైపు దృష్టి సారించాను. ఆరిపోయిన దీపకళికలా ప్రాభవాన్ని పొగ చూరిస్తున్నది. దీపం ఆరిపోగానే పొగ బయలు దేరుతుంది. అలానే యీ కోటకూడా పొగ వదలుతున్నది.

పాడు పడ్డకోట.

ఆరిపోయిన దీపకళిక.

దారంట నే నేమీ మాట్లాడ లేదు.

మఱ్ఱిచెట్టు దగ్గర వాళ్ళిద్దరూ నన్నొదిలి పెట్టారు. ఇంట్లోకి అడుగు పెట్టగానే రాజలక్ష్మి ఏమంటుందో అని భయపడుతూనే వెళ్లాను. వాకిట్లో అరుగుమీద నాకోసం యెదురుచూస్తూ కూచున్నది. కాళ్ళు కడుక్కుని గదిలోకిపోయి కూచున్నాను. సుడిగాలిలా వచ్చింది రాజలక్ష్మి 'ఎక్కడి కెళ్లావు' అంటూ, నేను చెప్పాను.

'నీ కోసం వొళ్ళు విరుచుకుని ఫలహారం చేసి, కాఫీకాచాను, నా మొహం చూడ్డానికి కూడా నీకు కష్టంగావుంది కదూ?' అంది.

నేనేం సమాధానం చేప్పేది: 'నామనసు బాగులేదు. అవును నిన్ను చూడలేను, నీవంటే అదివరకు మలుచుకున్న భావం విరుచుకున్నాను' అన్నాను గొంతులో అసహజత ధ్వనిస్తుండగా.

'ఏం, రాక్షసినా?'

'ఇది వరకు దేవతవు.'

రాజలక్ష్మి నవ్వింది. 'లేలే, కాస్త, కాస్త. పిచ్చి పడుతున్నట్లుంది, స్నానంచేసి భోజనం చెయ్యి, తీరిగ్గా పోట్లాడుకుందాం' అంది. 'నేప్రొద్దున్నే వెళ్లిపోతున్నాను' అన్నాను. రాజలక్ష్మి ముఖం చిన్న బుచ్చుకుని, 'వెళ్ళు' అన్నది.

నేను నిలువునా ఖూనీ అయినాను.

అలాటి సమాధానం వినవలసి వస్తుందని ఊహించలేదు, 'వద్దు అప్పుడే వెడతావా, నువు చాలా మంచివాడివి కదూ' అంటే నాకెంతో తృప్తి, ఉపశమనం. అలా అంటుందనే ఉద్దేశంతోనే అలా అన్నాను. ఇప్పుడేం చెయ్యాలి? గోడపక్కకు తిరిగి పండుకున్నాను.

రాజలక్ష్మి పక్కనే కూచుంది. నాకు తెలుసు. చీకట్లో చూడలేక పోయినా రాజలక్ష్మి కళ్ళు నవ్వుతుంటాయి.

బుజంమీద తడుతూ 'ఇకలే' అన్నది.

'నాకు ఆకలిలేదు. నువ్వెళ్ళు' అన్నాను.

ఈ సారి రాజలక్ష్మి నవ్వటం నాకు బాగా వినిపించింది. 'మరీ చిన్నపిల్లాడి వవుతున్నావు!' అంది. నేను లేచి కూచున్నాను. కళ్ళు మండి పోతున్నాయి. 'రాజక్కాయ్. నాకు నిజంగా ఆకలి లేదు.' అన్నాను. 'ఇలా జరుగుతుందా నాపెళ్ళి' అని కదా నీ ఆలోచన, దానికింత ఆలోచనా? తరువాత నీకు చెబుతాలే. ముందులే. నేను కలిపి పెడతాగా. నువ్విలానే పడుకుంటే నాకేమైనా బాగుంటుం దా?' అంది.

ఎన్ని కారణాలు చెప్పైనా నాకాకలి కావటం లేదని రాజ లక్ష్మిని వొప్పించలేను. అయినా కాకపోయినా నే తినందే వదిలి పెట్టదు. సరే, లేచాను.

అసలే, యీ ఊరొచ్చేప్పుడే వొంట్లో నీరసంగా వుంది. పైన ఇక్కడ, రాజలక్ష్మి పెళ్లిసంబంధం కుదిర్చి, ఏదో మహాత్కార్యాన్ని సాధించినట్లు సంతోషిస్తున్నారు. మనసంతా ఖరాబైంది. వీళ్లస్వార్థా న్ని, అమాయకత్వాన్ని చూసి. తర్వాత ప్రసాదరావు చెప్పిన కథతో పూర్తిగా విచలితుడనైనాను.

మనసులో సముద్ర మథనం జరిగింది. కేవలం హాలాహలం వుద్భవించింది. కానీ, అమృతం వొక్కబిందువుకూడా చిందలేదు.

ఇవన్నీ రాజలక్ష్మికి తెలీవు. అందుకే ఇక్కడనుంచి త్వరగా తెములుదామని అనిపిస్తుంటుంది. కాని అంత తొందరలో ధైర్యం చేసి పోలేను.

తలొంచుకొని తొందరగా భోంచేసిలేచాను. అరగంటగడిచిన తర్వాత రాజలక్ష్మి వచ్చింది. దీపం పెద్దది చేశాను. రాజలక్ష్మి ముఖంలో ఏదో దీప్తి కనపడ్డది.

పక్కమీద వోపక్క కూచుంది.

'నామీద కోపంగా వుంది కదూ?' అంది.

'ఎందుకు ?'

'అది నీక్కూడా తెలీదు'

'బాధగా వుంది'

'చూడు, నలుగురు సుఖపడేప్పుడు, ఆ నలుగురి సుఖంకోసం, వొకరు బాధపడితే నేమి... నీవు కథలు రాస్తావుగా, చెప్పు' అన్నది.

నేను పూర్తిగా పాలిపొయ్యాను ఇదెలా తెలిసింది. చచ్చాను భగవంతుడా, ఇక నన్నేడిపించటానికి కావలసినంత గ్రాసం. రామ రామ: నాకు యేడుపొచ్చినంత పనైంది.

'నీకో అమ్మాయిని చూస్తాను!'

'చూడు నాకేం అభ్యంతరం లేదు. వయసెంతున్నా సరే. ముసలిదైనా సరే, నగలూ, పాడిపశువులూ, ఇవివుంటే నేను సంతోషిస్తా.'

రాజ్యలక్ష్మి ముఖం చిన్నబుచ్చుకుంది.

'చివరకు నీ దృష్టిలో కూడా వెలితయ్యాను కదూ, ఊళ్ళో వాళ్ళంతా ఇప్పుడాడిపోస్తున్నారు. సరేలే అను' అంది.

'నిజం చెబుతున్నాను రాజక్కాయ్. అనుభవించటానికి కావలసినంత డబ్బుంటే చాలదా, జీవితానికి, ఇంకేం కావాలి ?' అన్నాను.

'ఈ తెలివి తేటలతోనేనా కథలు వ్రాస్తున్నావు?' అంది నాకు చాలా చిన్నతన మనిపించింది. ఈ విషయాలన్నీ ఆడవాళ్లకు తెలియకూడదు. నేను కథలు వ్రాస్తున్నానంటే, వీళ్లందరూ నన్ను అనుకోవాలని కాదు వ్రాస్తుంట. పొద్దు పోవటానికి.

'నేనేం కథలు వ్రాయటంలేదే! అలాంటి శక్తియుక్తులు భగవంతు డియ్యలేదు నాకు" అన్నాను. రాజలక్ష్మి నవ్వింది.

'వెంకటేశ్వర్లు చెప్పాడులే. నాలుగైదు చదివానుకూడా. ఆహా ఏమి ప్రేమలూ. ఏమి విరహాలూ'' అంది పగలబడి నవ్వుతూ.

మరీ పాలిపొయ్యాను. కొన్ని కొన్ని కథలు చదువుతుంటే నాకే నవ్వొస్తుంది.

రాజలక్ష్మి అన్నది.

'ఆ కథలో ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుం దెందుకని ? ఈ కథలో ఆవిడ అంతమాత్రానికే మొగుడితో పోట్లాడాలా?చాలా బాగా వ్రాస్తావు' అంది.

'నన్ను చంపకు. ఏదో వ్రాశాను, అయిపోయింది' అన్నాను విసుగ్గా.

'నీకేం తెలుసునని కథలు వ్రాస్తావు. జీవిత గమనాలు, జీవితపు విలువలు, జీవితాశయాలు. నీకు ఏంతెలుసు? వ్యక్తులను తత్వాలను ఏమర్థం చేసుకోగలుగుతావు?' అంది.

నిజమే! నిజంగా కథలు వ్రాయగలిగిన శక్తి నాకెక్కడుంది? అర్హతకూడా లేదు. రాజలక్ష్మి చెప్పింది సబబుగా కన్పించింది, జీవితపు లోతులను నేనేం పరిశీలించాను? వ్యక్తుల హృదయాలు నే

నెక్కడ చదివాను? ఏదో పది కథలు చదివి వో కథ వ్రాయటం తప్ప, నిజంగా నేనేం వ్రాయగలను ?

'నిజమే రాజక్కాయ్! ఇంకా ఏమైనా వున్నయ్యా చెప్పాల్సినవి? నాకు నిద్రొస్తోన్నది' అన్నాను.

'ఫరవాలేదులే. ప్రొద్దుటంతా నిద్రపోయావు. అయినా నడుమ అనవసరపు విషయం వచ్చిపడింది. నేను మొదట అడిగిందే మళ్ళీ అడుగుతున్నాను. నలుగురు సుఖపడేప్పుడు వొకరు సుఖాన్ని వదులుకుంటే నేం'' అంది రాజలక్ష్మి.

'కాని ప్రతివ్యక్తీ సుఖించాలనే కోరుకుంటాడు. అలాటి గొప్ప బుద్ధి అందరికీ వుండదు' అన్నాను.

గొప్పబుద్ధే కావచ్చుగాక! అంతా బుద్ధిపూర్వకంగా సుఖాన్ని త్యజించరు. పరిస్థితుల ప్రభావం" అంది రాజలక్ష్మి.

'కాని జీవితాంతం అనుభవించే కష్టనష్టాలు కూడా ఆలోచించాలిగదా? నీవు యీ తాతగారిని పెళ్లి చేసుకోకపోతే, పెళ్లి కాదని భయమా?' అన్నాను.

రాజలక్ష్మి గల గల నవ్వింది.

ఏమిటీ అలాటి జీవన్మరణ సమస్యలు చర్చించేప్పుడు గూడా, అలా నవ్వగలుగుతుంది?

'ఇక ముందలా తాతగారంటే నే నొప్పుకోను తెలిసిందా ?' అంది నవ్వుతూనే.

"మరి తాతగారు తాతగారే ! బావగారు కాలేరుగా !" అన్నాను.

'బాగానే అవుతారు. సరేలే మరి ఆ తాతగారు వచ్చేదాకా నన్ను వెతుక్కుంటూ ఎవరూ రాలేదేం' అంది.

"అది నిజమే! అయినా రత్నాన్ని వెతుక్కుంటూ ఎవరో వస్తారు. అప్పటిదాకా ప్రకాశించదు."

'లేదు. పొరపాటు పడుతున్నావు. ముగ్గురో నలుగురో చూసిపొయ్యారు. వాళ్లకు మూడు వేలూ, నాలుగు వేలూ కావాలట.'

దీనికి నేనేం సమాధానం చెబుతాను? రాజలక్ష్మిలాంటి పిల్లను చూసికూడా, వాళ్లు కళ్లకు పొరలు కప్పుకున్నారు. నేనంటే అభిమాన మంటారేమోకాని, అందంలో కాని, గుణగణాల్లో కాని, చదువూ సంస్కారాల్లో కాని రాజలక్ష్మి అందరికంటే ముందనిచాలా మంది అభిప్రాయం.

'నాకంటే ముగ్గురు చిన్నపిల్లలు. పెద్దవాళ్లయి సుఖపడాలిగా. వాళ్లకు చదువులు కావాలి ఇద్దరాడపిల్లలకు పెళ్లిళ్లు కావాలి, ఎలాచెప్పు? వీటన్నిటినీ సమర్థించుకుని నడుపుకుపొయ్యే వాళ్లెవరూ ఇంట్లోలేరు. నాన్న పోయినప్పటినుంచీ ఇప్పటిదాకా ఎలా బ్రతక గలిగానో తలుచుకుంటే ఆశ్చర్యంగా వుంది. ఏదో కొద్దిపొలం బ్రతికిస్తున్నది. నేలతల్లిని నమ్ముకుంటే అన్నం పెట్టక పోదు. కాని జీవితాలు సుఖవంతా లెలా అవుతవి?' అంది రాజలక్ష్మి.

'అయితే ఇంటికోసం నీసుఖాన్ని త్యాగం చేస్తున్నావన్న మాట?'

'అంతమాట నేననలేను!'

'అయినా నా కిష్టం లేదు.'

'ఇంక వేరుమార్గం లేదు' అంది రాజలక్ష్మి కాసేపు తలొంచుకుని ఏదో దీర్ఘంగా ఆలోచించింది.

'సుఖపడటమనేది మనుషుల మానసిక ప్రవత్తులనుబట్టి వుంటుంది. డబ్బూ, వయసూ, సుఖం సంపాదించి పెట్టలేవు. అమ్మమ్మ అంటున్నది, ఆ రెండెకరాలమ్మి నా పెళ్లి చేస్తుందట. అప్పుడు నేను సుఖపడతానని ఎవరైనా చెప్పగలరా? నెలరోజుల క్రింద యీ ఊరొదలివెళ్లారు దంపతులు. ఆయన ఏదో గుమాస్తాఅట. పాతికేళ్లుంటాయి. ఆ అమ్మాయికి నాఅంత యీడే వుండొచ్చు. ఏరోజూ యేడుపులూ, బొబ్బలతో తప్ప ప్రొద్దుగూకి తెల్లవారేది కాదు వాళ్లకు. ఏమంటావు? ఖర్మనుకూడా కొంతకు కొంత నమ్మాలి. ఎవరికెలా రాసివుందో? నేను సుఖపడలేకపోతాను. పోనీ ఆ పిల్లలకు అమ్మలేని కొరత తీరుస్తాను. వాళ్లకెలాటి మానసిక అసంతృప్తీ కలుగనియ్యను. వాళ్లను పెద్దవాళ్లను చేసి, పెళ్లిళ్లుచేసి, సుఖంగా జీవించండని ఆశీర్వదిస్తాను.

నా తమ్ముడికక్కడేవుంటే వాడు చదువుకోగలడా? వాడి జీవితం వెలుగు చూడగలుగుతుందా? వాణ్ని నాతోనే తీసుకెళతాను. ఆడపిల్లలను వొక ఇంటివాళ్లనుచేసి తృప్తిగా చచ్చిపోతాను. రాజలక్ష్మిముఖం వెలుగుతో నిండిపోయింది.

రాజలక్ష్మిని ఇంట్లోంచి ఎవరో పిల్చారు. రాజలక్ష్మి వెళ్లిపోయింది. గదితలుపులు దగ్గరగా లాగివేసింది. నేను దుప్పటి పైకిలాక్కున్నాను.

బయటంతా హోరున గాలి వినపడుతున్నది. కాని నాకు కాస్తకూడా సోకడంలేదు. రాజలక్ష్మి చెప్పినదంతా మననం చేసు

కుంటున్నాను. ఎక్కడో చీకట్లోపడి కొట్టుకొని వొక్కసారి వెలుగును చూసినట్లయింది.

రాజలక్ష్మి చెప్పిందంతా నిజమనిపించింది. పరిస్థితుల ప్రాబల్యం వ్యక్తులను లొంగదీస్తుంది.

ఎప్పటికి నిద్రపోయినానో కాని ప్రొద్దుటే లేచేటప్పటికి మనస్సు ప్రశాంతంగా వుంది. హృదయం చాలా తేలికపడ్డది. ఓ అరగంట గడిచిన తర్వాత బయట గదిలో రాజలక్ష్మి కోసం ఎదురు చూస్తూ కూచున్నాను.

కాఫీ కప్పుతో రాజలక్ష్మి ప్రత్యక్షమైంది. అక్కడే కూచుంది' నేను పెగల్చుకుని 'రాజక్కాయ్ నీ గురించి నాకెలాటిచెడ్డభావమూ లేదిప్పుడు. మొట్టమొదట నీ యీ పెళ్లిసంగతి విన్నప్పుడు నిన్నసహ్యించుకున్నాను. నిన్నర్థంచేసుకోలేక పోయినందుకు క్షమించు'' అన్నాను. రాజలక్ష్మి స్వచ్ఛంగా నవ్వింది.

ఇంతలోకే హేమ గవ్వలబుట్ట తీసుకుని ప్రవేశించింది 'ఆడుకుందామా?' అంటూ.

"ఆc! ఈ పిల్లతో ఆడి నువ్వేం గెలుస్తావు?"అంది రాజలక్ష్మి అని వెళ్లిపోయింది.

కాసేపు ఏదో ఆడుకున్నాం. ఎండ పడ్డతర్వాత హేమ వెళ్ళిపోయింది.

మధ్యాహ్నం రాజలక్ష్మిని అడిగాను హేమ గురించి. రాజలక్ష్మి కళ్లలో ఏవో నీడలు కదిలినై. 'ఇక ఏ సంగతులూ నాకొద్దు. నాకేం చెప్పకు' అన్నాను. మర్రోజు ఊరికెళుతుంటే బజారులో హేమ కన్పించింది, నీళ్లు తెస్తున్నది. నీళ్లు తొణికి వంటి భాగ

మంతా తడిసిపోయింది. హృదయంలో ఆశీర్వదించాను. మళ్లీ కారు ప్రయాణం, విసుగు యాభైమైళ్లు ఇల్లు చేరుకున్నాను.

తర్వాత హైదరాబాద్ వెళ్లాను. అన్నయ్య ఉద్యోగం చేస్తున్నాడక్కడ.

తర్వాత ఐదారు నెలల తర్వాత రాజలక్ష్మి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. ఇంటికొచ్చి హైదరాబాద్ రీడైరెక్టయింది ఆ ఉత్తరం విప్పి చదువుకున్నాను.

ఏ మాత్రం విచలితుణ్ని కాలేదు.

అలా జరుగుతుందని నాకెప్పుడో తెలుసు.

"ఆయన పోయారుట. పిల్లలూ వాళ్లు తన పాలనలో హాయిగా వున్నారట." ఇంకా ఏవేవో వ్రాసింది. చివర కలిపింది రాజలక్ష్మి తన్నొకసారి వచ్చి చూసిపొమ్మంటూ.

రాజలక్ష్మి ఉత్తరం వ్రాసింది; తన్నొకసారి వచ్చి చూసిపొమ్మంటూ. ★